ఉచిత కంటి పరీక్షలు

జన్నారం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరి ధిలోగల వయోవృద్ధుల సంఘం కార్యాలయంలో సోమవారం కరీంనగర్‌కు చెందిన శరత్ మ్యాక్స్‌విజన్, మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ జాతీయ కౌన్సిలర్ మొండయ్య మాట్లాడుతూ వయోవృద్ధులకు ప్రభుత్వ, ప్రైవేటు పరంగా అన్ని విధాలుగా సహకారం ఉండాలన్నారు. ఈకార్య క్రమంలో వయోవృద్ధులు రాజలింగం, రాజారావు, తిరుపతిరెడ్డి, గోపి సత్యనారాయణ, భూమన్న, పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తున్నాం

● వందుర్‌గూడ్ ఆదివాసీల తీర్మానం..



వందుర్‌గూడలో నిరసన ఆందోళన చేస్తున్న ఆదివాసి గిరిజనులు

దండేపల్లి అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో వందుర్‌గూడ, వెంకటాపూర్ పంచాయతీలకు వేరు వేరుగా నోటిఫికేషన్ వెలువరించటాన్ని వ్యతిరేకిస్తూ వందుర్‌గూడ ఆదివాసీల ఆదివారం రాత్రి సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు తీర్మానం చేశారు. వందుర్‌గూడ గ్రామ పటేల్ దౌలత్‌రావు మొకాసి మాట్లాడుతూ గతంలో దండే పల్లి మండలం వెంకటాపూర్ పంచాయతీలో వందుర్‌గూడ కొనసాగింది. 2018లో అధికారుల తప్పుడు నివేదికతో వందుర్‌గూడను వెంకటాపూర్ జీపీ నుంచి వేరు చేసి కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. వందుర్‌గూడను వెంకటాపూర్ జీపీలో కొనసాగించాలని ఇటీవల కోర్టులో పిటిషన్ వేశామన్నారు. అధికారులు మళ్లీ పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం అధికారులకు ఆదేశాలు జా రీ చేసి నెల రోజు కావాస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీ వల స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈ రెండు జీపీలకు వేరు వే రుగా వెలువరించడం పట్ల వందుర్‌గూడ్ ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చే శారు. దీంతో తామంతా స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తున్నా మని తీర్మానించారు. కార్యక్రమంలో వందుర్‌గూడ ఆదివాసీలు కోవ ధర్మరావు, మారుతీ, ఆడ చందు, కుంరం బాపురావు, పెంద్రం హేమంత్, సేడ్మకి తిరుపతి, గిరిజనులు పాల్గొన్నారు.



నిఘా నీడలో 'స్థానిక' ఎన్నికలు..

● ఎంసీసీని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు

● ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు

● చెక్ పోస్టుల ఏర్పాటుతో జిల్లా కట్టుదిట్టం

● నగదు, మద్యం సరఫరా అరికట్టడమే లక్ష్యం

మంచిర్యాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదటి విడుతలో నిర్వహించే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎలక్షన్లను నిఘా నీడలో నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ రంగం సిద్ధం చేసింది. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే విధానానికి చెక్ పెట్టే చర్యలు తీసుకుంటున్నారు. వివిధ విభాగాలకు చెందిన ప్రత్యేక బలగాలతో విస్తృత తనిఖీలు నిర్వహించడం ద్వారా నగదు, మద్యం, ఇతర ప్రలోభాలకు గురి చేసే వస్తువుల తరలింపునకు అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ప్రత్యేక బృందాలు ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలపై నిఘా వేసి, తనిఖీలు ముమ్మరం చేశాయి. కట్టుదిట్టమైన చర్యల్లో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సంద ర్భంగా జిల్లా ఎన్నికల అధికారులకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.

చెక్ పోస్టుల ఏర్పాటుతో కట్టుదిట్టం..

ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహాన్ని అరికట్టేందుకు ఎన్నికల కమిషన్ పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా జిల్లా సరిహద్దుల ద్వారా జిల్లాలోకి, అలాగే జిల్లా నుంచి ఇతర జిల్లాలకు నగదు, మద్యం, దేశీ దారు, గుడుంబా, ఆయుధాలు, ఉచిత ప్రలోభాలకు సం బంధించిన వస్తువులు తరలిపోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా జిల్లా బోర్డర్‌లలో ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసింది. వీటిలో ఒక అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ ఉండగా, మరికొన్ని జిల్లా చెక్ పోస్టులు ఉన్నాయి. మహారాష్ట్రతో సరిహద్దు ప్రాంతం కలిగి ఉన్న జిల్లాలోని కోటపల్లి మండలంలో పారుపెల్లి ఎక్స్ రోడ్డు వద్ద అంతరాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు చేయగా, తాండూరు ఐబీ వద్ద, జన్నారంలోని ఇందన్‌పల్లి వద్ద అటవీశాఖ చెక్ పోస్టు, దండేపల్లి మండలం గూడెం, జైపూర్ మండలం ఇందారం వద్ద ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఆయా చెక్ పోస్టుల్లో ఎస్ఎస్‌టీ సభ్యులుగా రెవెన్యూ, పోలీస్‌శాఖ, నీటిపారుదలశాఖ, వ్యవసాయ శాఖలకు చెందిన వివిధ కేడర్ల అధికారులు పని చేస్తారు. జిల్లాలోని ఇతర రాష్ట్రాలు, జిల్లాలను కలిపే మండలా ల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నలుమూలలా కట్టుదిట్టం చేశారు.

నిఘా ముమ్మరం....

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)ని పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా రహదారులపై నిఘా ముమ్మరం చేసేందుకు ప్రత్యేకంగా స్టాటికల్ సర్వేయ్‌లెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీ), ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్ (ఎఫ్ఎస్‌టీ)ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఎస్ఎస్‌టీ బృందాలు జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్‌శాఖ డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో పని చేస్తాయి. ఆయా టీమ్స్‌లో ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, పోలీస్‌శాఖకు చెందిన ఎస్సై, ఏఎస్సై స్థాయి అధికారి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన చెందిన ఉద్యోగులు సభ్యులుగా ఉంటారు. ఎస్ఎస్‌టీ బృందాలు సాధారణ తనిఖీలతోపాటు వివిధ ప్రాంతాల్లో సంఘ వ్యతిరేక శక్తుల కదలికలను కూడా పర్యవేక్షిస్తాయి. అలాగే తనిఖీల

-మిగతా 5లో

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా శివకుమార్



మంచిర్యాలక్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా పాత మంచిర్యాలకు చెందిన కుందారపు శివకుమార్‌ను ఎన్నుకు న్నారు. పార్టీకి చేసిన సేవలకు గాను తనను గుర్తించి ఈ పదవిని అప్పగించి నందుకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నాయకులు చిట్ల సత్యనారాయణ, పూదరి తిరుపతి, నరేష్ ఆయనను అభినందించారు.

ఘనంగా వన్యప్రాణి వారోత్సవాలు



వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది

జన్నారం, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా జన్నారం అటవి డివిజన్‌లోని మండల కేంద్రంలో అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవిశాఖ ఎఫ్‌డీవో రామ్మోహన్ మాట్లాడుతూ వన్యప్రాణులను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. నేటి యువత భవిష్యత్‌తరాలకు సమతు ల్యమైన పర్యావరణాన్ని అందించాలంటే వన్యప్రాణులతో పాటు అటవీసంరక్షణ బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. ప్రతివ్యక్తికి స్వచ్ఛమైన గాలి అవసర మని అటవీ సమతుల్యత చెందాలంటే వన్య ప్రాణులు ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో అటవీ శాక ఎఫ్ఆర్‌లోలు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

దండేపల్లి అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన పోల్లంపల్లి రామరాజును మామిడిపల్లి గ్రామ మున్నూర్‌కాపు సంఘం ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సత్కరించారు. ఇటీవల కలెక్టర్ కుమార్‌దీపక్ చేతులమీదుగా రామరాజు జిల్లాస్థాయి ఉత్తమఉపాధ్యాయ పురస్కారం అందు కున్న నేపథ్యంలో సోమవారం మున్నూర్ కాపు సంఘం భవనం వద్ద ఆయనను పూల మాల శాలువతో ఘనంగా సన్మానించారు. అసంఘం అధ్యక్షుడు కొప్పుల కమలాకర్ మాట్లాడుతూ జిల్లా ఉత్తమ అవార్డు పొలంపల్లి రామరాజుకు రావడం మనసంఘానికి గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా అతనిని అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతులు కపాస్ కిసాన్ యాప్ వినియోగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతులు పత్తి విక్రయించేందుకు కపాస్‌కిసాన్ యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా అదనపుకలెక్టర్ చంద్రయ్య అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వ్యవసాయాధికారులకు శిక్షణ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరంలో కనీస మద్దతు ధర కింద సీసీఐకి పత్తివిక్రయిం చేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసా న్‌యాప్‌లో రైతులు తమ వివరాలను నమోదు చేసుకుని పత్తివిక్రయానికి స్లాట్ బుక్‌చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నిబంధనల ప్రకారం పత్తిలో తేమ 12శాతంకంటే తక్కువగా ఉండాలని, నాణ్యతలేని, రంగుమారిన వర్షానికి తడి సిన పత్తిని కొనుగోలు చేయడం జరగదని, రైతులు విక్రయించేందుకు విడి పత్తిని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఆధార్ నెంబర్‌కు అనుసంధానం చేయబడిన బ్యాంకుఖాతాలో మాత్రమే చెల్లిం పులు జరుగుతాయన్నారు. రైతులు దళారులను నమ్మిమోస పోకుండా సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులు కొనుగోలు చేసిన పత్తినికొనుగోలు కేంద్రాల్లోకి అనుమతించకూడదని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సురేఖ, మార్కెటింగ్ అధికారులుషహా బుద్దీన్, అశ్వక్ అహ్మద్ పాల్గొన్నారు.

కష్టపడి పని చేయాలి

● ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్

జన్నారం, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్త, నాయకులు కష్టపడి పని చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్‌ఆర్ గార్డెన్‌లో ఓటు చోరీ కరపత్రాలను విడుదల చేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు చోరీ వల్లే బీజేపీ అధికారంలోకి వచ్చిందని ప్రతి గ్రామంలో ఓటు చోరీపై అవగాహన కల్పించాలన్నారు.



ఓటు చోరీ కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

అదే విధంగా గ్రామ పంచాయతీ స్థానిక ఎన్నికల్లో ప్రతీ ఒక్క నాయకుడు కష్టపడి పని చేసి ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముజాఫర్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణతో పాటు మండల నాయకులు సుభాష్ రెడ్డి, మోహన్‌రెడ్డి, మచ్చ శంకరయ్య, నందునాయక్, తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగం నిలిపివేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చిన్న పిల్లల్లో దగ్గును నియంత్రించేందుకు వినియోగించే కోల్డ్ రిఫ్ సిరప్ వాడకాన్ని వెంటనే నిలిపివేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అనిత ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ డైరెక్టర్, కలెక్టర్ ఆదేశాల మేరకు కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగం వెంటనే ఆపాలన్నారు. సిరప్ నిల్వలు జిల్లాలో అందుబాటులో లేవని, జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, పార్మాసిస్టులు, ఏజెన్సీలు తమ వద్ద సిరప్ నిల్వలు ఉన్నట్లయితే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఈ సిరప్‌వల్ల చిన్న పిల్లల్లో అనారోగ్య సమస్యలు రావడంతో ఈ మందు నిషేధించారన్నారు. సంబంధిత సిరప్‌లు ఉంటే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 18005996969లో వివరాలను అందిం చాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నీటి వనరుల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నీటి వనరుల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని జాతీయ జల మిషన్ డైరెక్టర్ అర్చనవర్మ పేర్కొన్నారు. సోమవారం జాతీయస్థాయి 51వ వెబినార్ కార్యక్రమంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కుమార్ దీపక్, జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలోని రాజౌరి కలెక్టర్ అభిషేక్‌లతో జల సంచాయి జన భగీదారి కార్యక్రమంలో నీటి వనరుల ఆవశ్యకత, పరిరక్షణ బాధ్యతలపై చేపట్టిన చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జల మిషన్ డైరెక్టర్ మాట్లాడుతూ జల సంచాయి జన భగీదారి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో విజయవంతంగా అమలు చేసిన నీటి సంరక్షణ కార్యక్రమాల ప్రదర్శన, ఇతర అంశాలతో జాతీయ జల శక్తి శాఖ ఆధ్వర్యంలో వెబినార్ నిర్వహించారన్నారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినందుకు గాను రూ. 2 కోట్ల అవార్డుకు ఐదు జిల్లాల కలెక్టర్లు అర్హులయ్యారని తెలిపారు. అనంతరం కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని 18 మండలాల్లో 16 గ్రామీణ, 2 పట్టణ ప్రాంతాల మండలాలు ఉన్నాయని, 82 శాతం గోండ్వానా శిలలు, 18 శాతం ఆర్కియన్‌శిలలతోఏర్పడి ఉందని తెలిపారు. సింగరేణి కాలరీస్, ఓరియంట్ సిమెంట్, ఇసుక మైనింగ్ రీత్యా ఎక్కువ నీరు అవసరం ఉందని, వర్షాధార పంటలు సాగు చేస్తారన్నారు. గత సంవత్సరం జిల్లాలో 43,545 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా నీటి సంరక్షణ చర్యలు చేపట్టామన్నారు. మూడేళ్లలో 45 లక్షల మొక్కలను నాట మని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళ గ్రూపుల ద్వారా సమావేశాలు నిర్వహించి భూగర్భ జల స్థాయి పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, విద్యాశాఖ సమగ్ర శిక్ష సమ న్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బిల్లులు, గౌరవ వేతనం చెల్లించండి



దండేపల్లి ఎంఈవో రాజుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మధ్యాహ్నభోజన నిర్వాహకులు

దండేపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకునే విద్యార్థుల కోసం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం సంబధించిన బిల్లులు, గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని మధ్యాహ్నభోజన నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి కోరారు. సోమవారం దండే ప ల్లిలో విద్య వనరుల కేంద్రంలో ఎంఈవో మంత్రి రాజును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆమె మా ట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులమని తామకు 6నెలల నుంచి బిల్లులు, కోడిగుడ్ల బిల్లుతో పాటు గౌర వ వేతనం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. నిత్యావసర వస్తువుల కోసం బయట అప్పులు చేయాల్సి వస్తోందని వాపోయారు. కుటుంబ పోషణ బారంగా మారుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులతో పాటు గౌరవ వేతనం నెలకు రూ 10వేలు చెల్లించాలన్నారు.

దీంతో తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, గౌ రవ వేతనం కోసం ఈనె 4నుంచి పాఠశాలల్లో వంటవండటం బంద్ చేశామన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తమకు రావాల్సి పెండింగ్ బిల్లులన్నీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మల్లేశ్వరి, రాజేశ్వరి, మదనమ్మ, లక్ష్మి, శంకరక్క, సరోజ, పుష్ప. సత్యవతి, శీల, భూమక్క, మరియా, జమున నాగ మ్మ, వనిత, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

చలాన్లపై నిర్లక్ష్యం వద్దు

● ఐదుకు మించి ఉంటే లైసెన్స్ రద్దు

● 48 రోజుల లోగా చెల్లించకుంటే వాహనం స్వాధీనం

మంచిర్యాల క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్‌నిబంధనల విషయంలో నిర్లక్ష్యంవహిస్తే ఇకపై తగిన మూల్యం చెల్లించక తప్పదు. చలాన్‌పడితే పోలీసులు ఆపినప్పుడు చూద్దాంలే అనుకునే రోజులు పోయాయి. 45 రోజుల్లోగా చలాన్‌లు చెల్లించాలి. లేదా మీ తప్పు లేకుంటే అప్పీల్ చేసుకోవాలి. అంతకు మించి ఆలస్యం చేస్తే మీ వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవచ్చు. డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కుదరదు. ఐదుకు మించి వాహనంపై చలాన్‌లు ఉంటే లైసెన్స్ రద్దు అయ్యే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం మోటార్ వెహికల్స్ రూల్స్ 1989 కేంద్ర రవాణా శాఖ ఈ సవరణను చేయనుంది. దీనికోసం ప్రతిపాదనలు పంపింది. గతంలో చలాన్లపై చర్యల అంశం వివరంగా లేకపోవడంతో కొత్త ముసాయిదా ప్రకారం సవరణను తీసుకురానుంది.

కొత్త ప్రతిపాదనలు ఇవే..

ప్రస్తుతం 90 రోజుల్లో చలాన్ కట్టాలి. కొత్త నిబంధనల్లో చలాన్ చెల్లింపు గడువును 45రోజులకు కుదించింది. ఆలస్యం చేస్తే ఆవాహనంపై రవాణాశాఖ ఎలాంటి లావాదేవీలను అనుమతించ కుండా ఉంటుంది. దీనివల్ల వాహనాన్ని ఎవరికి విక్రయించరాదు. లైసెన్సులో పేరు మార్పు, చిరునామాతో పాటు రెన్యువల్ కూడా కుదరదు. ఎంవీ (మోటార్ వెహికల్) యాక్టు కింద ఒక వాహనంపై ఐదు, అంతకు మించి చలాన్లు ఉంటే డ్రైవింగ్ లైసెన్సును సంబంధిత అథారిటీ సస్పెండ్ చేయవచ్చు. ఇప్పటికే ఉన్న నిబంధనలు కొన సాగుతాయి. చలాన్లు కట్టకపోతే వాహనా న్ని స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు ఉంటుంది. ప్రస్తుతం చలాన్లు వాహన యజ మాని పేరుతో జారీ అవుతున్నాయి. ఇక నుంచి యజమాని వాహనం నడపలేదని నిరూపిస్తే డ్రై వింగ్ చేసిన వ్యక్తిని బాధ్యుడిని చేస్తారు.

మంచిర్యాల పట్టణంలో ఈ సంవత్సరం చలాన్ల వివరాలు...

పట్టణంలో ఓవర్ స్పీడుకు గాను 3394 వాహనాలకు రూ. 3,39, 4000, సెల్‌ఫోన్ డ్రైవింగ్ 1246 వాహనాలకు గాను రూ. 1,24,6000, డ్రంకెన్ డ్రైవ్ 1053 వాహనాలు, మైనర్ డ్రైవింగ్ 37 వాహనాలకు 18,500, త్రిపుల్ రైడింగ్ వాహనాలు 1432కు గాను రూ. 1,71,8400, రాంగ్ సైడ్ డ్రైవింగ్ 1958 వాహనాలకు రూ. 1,65,3100, రాంగ్ పార్కింగ్ వాహనాలు 1713కు గాను రూ. 1,71,300, నంబరు ప్లేటు లేని వాహనాలు 845కు గాను రూ. 1,69, 000 రూపాయలు చలాన్లు విధించారు.

పేద, మధ్యతరగతి వాహనదారుల్లో ఆందోళన...

కొత్త వాహన చట్టం ద్వారా 45 రోజుల్లో చెలాన్లు చెల్లించకుంటే వాహన సీజ్ చేయడం వల్ల మధ్యతరగతి, పేదరికానికి చెందిన వాహనదారులే ఎక్కువగా ఇబ్బందులకు గురవుతారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా చలాన్ల విషయం లో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

లక్సెట్టిపేట, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణ న్యాయస్థానంలో న్యాయవాదులు సోమవారం తమవిధులు బహిష్కరించారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న మాట్లాడుతూ గోదావరిఖని న్యాయస్థానంలో న్యాయవాది అయిన గుళ్లరమేష్‌పై జరిగిన దాడికి నిరసనగా న్యాయ వాదులందరం ఐక్యతతో విధులు బహిష్కరించామని రోజురోజుకు న్యాయవాదులపై దాడులు అధికం అవుతున్నాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసారు. న్యాయవాది రమేష్‌పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నళినికాంత్, జాయింట్ సెక్రటరీ సత్య గౌడ్, ఎగ్జ్యూటీవ్ మెంబర్ ప్రకాశం, సీనియర్ న్యాయవా దులు కారుకూరి సురేందర్, అక్కలశ్రీధర్, గోవింద్‌రావు, కిరణ్‌కుమార్, రవీందర్, షఫీక్, పద్మ, తాజోద్దీన్ పాల్గొన్నారు.



విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

భార్య ఆత్మహత్యాయత్నం..

- కాపాడబోయిన భర్తకు గాయాలు

నెన్నెల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ ఇద్దరి ప్రాణాల మీదిగి తెచ్చింది. నిప్పంటించుకొని భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడి తీవ్రంగా గాయపడగా, కాపాడబోయిన భర్తకు కూడా గాయాలపాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెట్‌పల్లి గ్రామానికి చెందిన జాడి రాజన్న, లలిత దంపతులు తమ కూతురికి నూతన వస్త్రాలంకరణ ఫంక్షన్ చేయాలనే విషయంలో సోమవారం గొడవ పడ్డారు. ఫంక్షన్ చేద్దామని భార్య. వద్ద ని భర్త వాదించుకొన్నారు. భర్త తన మాట వినడం లేదని భార్య లలిత పెట్రో లు పోసుకొని నిప్పంటించుకొంది. ఒళ్లంతా కాలి తీవ్ర గాయాలయ్యాయి. లలితను రక్షిం చే ప్రయత్నంలో రాజన్నకు మంటలు అంటుకున్నాయి. అతడికి ఎడమ చేయి కాలిం ది. గమనించిన గ్రామస్థులు మంటలు ఆర్పి వారిద్దరిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకెల్లారు. సంఘటన జరిగినట్టు తమకు సమాచారం ఉందని ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఇంకా పిర్యాదు అందలేదన్నారు.

గుండె పోటుతో డీఎస్పీ మృతి


విష్ణుమూర్తి (ఫైల్)

ఆసిఫాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఫంక్షనల్ వర్టికల్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న విష్ణుమూర్తి (59) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. డీఎస్పీ విష్ణుమూర్తి గుండె పోటుతో మృతి చెందడంతో జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్పీ విష్ణు మరణం పోలీసు శాఖకు తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. జిల్లా పోలీసు శాఖ తరపున ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం


ఎల్లయ్య (ఫైల్)

మందమర్రిరూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారంగపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం మందమర్రి మండలంలోని రామకృష్ణపూర్‌కు చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు వేల్పుల ఎల్లయ్య (70) ఈ నెల 2న మేకలను మేపడానికి సారంగపల్లి అటవీ ప్రాంతంలోకి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు గాలించారు. ఆచూకీ దొరకకపోవడంతో ఎల్లయ్య కొడుకు వేల్పుల రమేష్ రామకృష్ణపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. సోమవారం సారంగపల్లి అటవీ ప్రాంతానికి వెళ్లిన పశువుల కాపర్లకు మృతదేహం కనిపించింది. వారు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎల్లయ్య మృతదేహంగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో నాయకులు

తిర్యాణి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) మండలంలోని తలండి పుల్లుబాయిగూడ గ్రామానికి చెందిన భగవంతరావు పటేల్, 60 గ్రామస్థులు, మహిళలు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, వెంకటేశంగౌడ్, బుద్దే విజయ్, హరీష్‌కుమార్, కొమురయ్య, చిన్నయ్య, వెంకటేశం, వెంకటేశం, రాజయ్య, చంద్రమౌళి, బాదిరావు, జంగు, కృష్ణ, మధుర్, కృష్ణ, తిరుపతి, రమేష్, కృష్ణ, భగవంతరావు, గంగారాం, జంగు, బల్లార్షా, సొంబాయి, ఇంద్ర, జ్యోతి, రుక్కుంబాయి, నాందేవ్, కమల, బాద్రుబాయి, సభద్ర, లక్ష్మి మీరాబాయి, లక్ష్మి, లలిత, జీవిత, లక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పూలు, పండ్లు తాజా కూరగాయలు ఒకే చోట విక్రయించడం ద్వారా పేదలకు ఉపాధి అవకాశాలతో పాటు వినియోగదారులకు సౌలభ్యంగా ఉంటుందన్న ఉద్దేశంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు మంజూరైనా ఇంకా కలగానే మిగిలిపోయింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా స్థలం లేకపోవడంతో వాయిదా పడుతోంది. శంకుస్థాపన చేసినప్పటికీ నేటికి నిర్మాణానికి నోచుకోవడం లేదు. దీంతో మార్కెట్ ప్రాంతంలో రోడ్లపైనే విక్రయాలు జరపాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల వ్యాపారులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. స్థానిక కాగజ్‌నగర్ మెయిన్ మార్కెట్‌తో పాటు సర్‌సిల్క్‌లోని చిన్న మార్కెట్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఏళ్లు గడుస్తున్నా ఎటువంటి అభివృద్ధి కానరావడంలేదని పట్టణ వాసులు వాపోతున్నారు. దీంతో సర్‌సిల్క్‌తో పాటు, ప్రధాన మార్కెట్‌లో రోడ్లపైనే చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రైతు బజార్ ఉన్నప్పటికీ మెరుగైన సౌకర్యాలు ఇంకా కల్పించాల్సి ఉంది. రైతు బజార్ కేంద్రం లేకపోవడంతో కాగజ్‌నగర్ మార్కెట్‌లో దళారుల దందా కొనసాగుతోంది.

సమీకృతం.. తీరని స్వప్నం

- కలగానే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణం
- నిధులున్నా.. స్థలం కరువు
- రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు
- వ్యాపారులకు తంటాలు

● అన్ని ఒక్క చోటనే లభ్యం

జిల్లాలోనే కాగజ్‌నగర్ ముఖ్యమైన పట్టణం అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టిం చుకోవడం లేదనే విమర్శలున్నాయి. దాదాపు 70,000 జనాభా కలిగిన కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 30 వార్డులుండగా, ఏటా నాలుగు కోట్ల రూపాయలపైనే అంచనా బడ్జెట్ ఉంటోంది. ప్రతీ ఆదివారం వారంతపు సంతతో పాటు నిత్యం క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఐదేళ్ల క్రితం సమీకృత మార్కెట్ కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ ఇంకా నిర్మాణానికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి నిధులు మూలుగుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కల నెరవేరడం లేదు. గత 2020లో అప్పటి ప్రభుత్వం కాగజ్‌గనర్ మున్సిపాలిటీకి 5.2 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే అప్పటి పాలకవర్గం ఆధ్వర్యంలో అధికారులు స్థల సేకరణ కోసం అనేక స్థలాలను పరిశీలించారు. పలు కారణాలతో ఒక్క చోటి నుంచి మరో చోటికి మార్చారు. అయినప్పటికీ నేటికింకా నిర్మాణం ప్రారంభం కాలేదు. కాగజ్‌నగర్‌తో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల అనేక గ్రామాల నుంచి వ్యాపారులు కాగజ్‌నగర్ వస్తుంటారు. దీంతో కూరగాయలను ఎక్కువపడితే ఎండలో ఎండుతూ వానలో తడుస్తూనే క్రయవిక్రయాలు జరుపుకోవాల్సి వస్తోంది. కోట్లాది రూపాయల నిధులు విడుదల అయినప్పటికీ నిర్మాణాలు మాత్రం పూర్తి చేయలేదు.

● స్థలాలు పరిశీలించినా..

కాగజ్‌నగర్‌లో కూరగాయలు, మాంసం, చేపలు, ఇతరత్ర అన్ని సరుకులు ఒక్క చోటనే దొరికేందుకు సమీకృత మార్కెట్ నిర్మిస్తే అన్ని హంగులతో మార్కెట్ అభివృద్ధి జరిగేది. కానీ పనులు ప్రారంభం కాక పెండింగ్‌లో ఉండిపోయింది. మార్కెట్ నిర్మాణం కోసం స్థలం సేకరించే విషయంలో అప్పటి పాలకవర్గం సైతం ఆర్‌అండ్‌బీ, ఈఎస్‌ఐ భూమితో పాటు పలు స్థలాలను పరిశీలించింది. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు తీసుకున్నారు. గెస్ట్‌హౌస్ కూల్చివేసి ఆ స్థలం అనుకూలంగా ఉంటుందని లేఖ రాయడంతో అనుమతి కూడా వచ్చిందని అప్పటి కమిషనర్ ప్రకటించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కల నెరవేరకపోవడంతో చిరు వ్యాపారులు తంటాలు పడుతున్నారు.

స్థల సేకరణే ప్రధాన సమస్య

రాజేందర్, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ సమీకృత మార్కెట్‌కు గతంలో స్థలం సేకరణ కాకపోవడంతో నిర్మాణం జరగలేదు. గతంలో మార్కెట్ కోసం పలు చోట్ల స్థలసేకరణ కోసం ప్రయ త్నాలు జరిగాయి. స్థలాభావం వలన సమీకృత మార్కెట్ నిర్మాణం ప్రారంభం కాలేదు.

జోడేఘాట్‌కు బయలుదేరిన కుమరం భీం వారసులు

సిర్పూర్(యు), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద దొబ్బలో నివాసిస్తున్న కుమరం భీం వారసులు భీం వర్ధంతికి జోడే ఘాట్‌కు సోమవారం బయలుదేరారు. కుమరం భీం వారసులుతోపాటు బంధువులు, వివిధ గ్రామాల ఆదివాసీలు పెద్ద దొబ్బ గ్రామంలో గల కుమరం భీం దంపతుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుమరంభీం మనవడు కుమ్ర సోనేరావు మాట్లాడుతూ జోడే ఘాట్‌లో సోమవారం రాత్రి అవ్వల్ పెన్ పూజ నిర్వహిస్తామన్నారు. మంగళవారం కుమరం భీం జెండా అవిష్కరణ కార్యక్రమంతోపాటు కుమరం భీంకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో కుమరం భీం మనవడు కుమ్రు సోనేరావు, కుమరం భీంరావు, కుమరం మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.


జోడేన్‌ఘాట్‌కు తరలుతున్న కుమరం భీం వారసులు

ఆసిఫాబాద్ పట్టణ బంద్ ప్రశాంతం


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న హిందూ ఉత్సవ కమిటీ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గత శుక్రవారం శారద, దుర్గదేవిల శోభాయాత్రలో పోలీసులతీరును నిరసిస్తూ హిందూ సంఘాల సభ్యులు సోమవారం ఇచ్చిన పట్టణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూసివేసి స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బంద్‌తో దుకాణాలన్నీ మూసి ఉండడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. శోభాయాత్రలో మహిళ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు చేదోడువాదోడుగా ఉండాల్సిన పోలీసులే ఇబ్బందులకు కారణమవుతున్నారని విమర్శించారు. పట్టణంలో ఇటీవల జరిగిన వినాయక, దుర్గా నవరాత్రులను సంప్రదాయ బద్ధంగా జరుపుకోనివ్వకపోవడం బాధాకరమన్నారు. మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించిన ఎస్సై ఉదయ్ కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భక్తులపై అక్రమ కేసులు బనాయించడం శోచనీయమన్నారు. గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితులు నెలకొనలేదని అందరు ఐకమత్యంతో పండుగలు సంప్రదాయ బద్ధంగా జరుపుకుంటు వస్తున్నారన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం సరి కాదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భక్తులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేసి, నిర్వాహకులకు సంబంధించిన డీజేలను ఇవ్వాలని కోరారు. సభ్యులు బాలేశ్వర్‌గౌడ్, గాదవేణి మల్లేష్, చిలువేరి వెంకన్న, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌లో మూసి ఉన్న దుకాణాలు

కుమరం భీం వర్ధంతిని విజయవంతం చేయాలి

జైనూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాట యోధుడు కుమరం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని కెరమెరి మండల పరిధిలో గల జోడేఘాట్‌లో కుమరం భీం వర్ధంతిని మంగళవారం నిర్వహించడం జరుగుతుందని భీం వర్ధంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించిందని తెలిపారు. అడవి బిడ్డ కుమరంభీం వర్ధంతిని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించడంతో జిల్లా ప్రజల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుతున్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా ఆదివాసులు, మేధావులు, విద్యావంతులు అన్ని కుల సంఘాల నాయకులు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కుంరంభీం వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారని, జిల్లాలోని వివిధ మండలాల్లో నెలకొన్న సమస్యల్ని ఆదివాసీలు మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మేస్రాం అంబాజీ, పెందరుర్ ప్రకాష్, కోట్నాక దౌలత్‌రావ్, కనక గంగారాం, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ మరస్కోల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చాలి


గుంత వద్ద నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

రెబ్బెన, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవాగు సమీపంలో ఏర్పడిన గుంతలను పూడ్చాలని డీవైఎఫ్ఐ నాయకులు పురుషోత్తం, శివలు డిమాండ్ చేశారు. సోమవారం వంతెనపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై ఏర్పడిన గుంతల మూలంగా తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రహదారిపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

'స్థానిక' ఎన్నికలపై సమావేశం

వేమనపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాయిబాబు, ఎంపీడీవో కుమారస్వామిలు మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలుచేయాలన్నారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ కోటేశ్వర్ సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ సాయికృష్ణ, పీఆర్ ఏఈఈ ప్రదీప్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందన


విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మైనార్టీ విద్యా సంస్థలో విద్యను అభ్యసించి ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులను కలెక్టర్ వెంకటేష్ దోత్రే సోమవారం అభినందించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో విద్యార్థులను శాలువా, మొక్కలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకావాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కాగజ్‌నగర్‌లోని బాలుర మైనార్టీ విద్యా సంస్థల్లో చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన సయ్యద్ అంజద్ అలీ, సయ్యద్ ఇక్రాముద్దీన్, సయ్యద్ అబుజార్‌లను అభినందించారు. తల్లిదండ్రులు మైనార్టీ గురుకులాల్లో తమ పిల్లలను చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి అబ్దుల్ నదీం, మైనార్టీ అకాడమిక్ సమన్వయకర్త రిజ్వాన్, విజిలెన్స్ అధికారి తాహెర్, ప్రిన్సిపాల్ జబ్బర్, తదితరులు పాల్గొన్నారు.

వులెన్ జాకెట్లు, రెయిన్ కోట్స్ పంపిణీ

ఆసిఫాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది, హోంగార్డుల శ్రేయస్సు కోసం ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పోలీసులకు వులెన్ జాకెట్లు, టీ షర్టులు, హోంగార్డులకు రెయిన్ కోట్స్‌లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, పోలీసు సిబ్బంది శ్రమతో కూడిన విధులను దృష్టిలో ఉంచుకుని వారికి అవసరమైన వస్తువులను అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ పెద్దన్న, సీఐ రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి రేయిన్ కోటులు పంపిణీ చేస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్



వేతనాలు వెంటనే చెల్లించాలి


కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తమకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, వాటిని వెంటనే అందించాలని సీఆర్ఆర్ కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ వెలికితీసే సీఆర్ఆర్ కాంట్రాక్ట్ కంపెనీలో తాము కొన్నేళ్లుగా పనిచేస్తున్నామన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు అందించడం లేదని, అకస్మాత్తుగా కంపెనీ మూసివేశారని, వేతనాలు ఇప్పిస్తానని సింగరేణి అధికారులు హామీ ఇచ్చి మాట తప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసీపీ పీవో, జీఎం, లేబర్ కమిషనర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మద్దతు తెలిపారు.

కార్మిక సంక్షేమానికి నిరంతర కృషి

శ్రీరాంపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. శ్రీరాంపూర్ యూనియన్ సభ్యత్వ నమోదుకు సోమవారం చేపట్టారు. పలువురు కార్మికులకు సభ్యత్వ రశీదులు అందించారు. కార్యక్రమంలో కేంద్ర నాయకులు గరిగె స్వామి, తిరుపతి రాజు, జీవన్ జోయల్, శీలం చిన్నయ్య, బ్రాంచ్ నాయకులు చంద్రమోహన్, లక్ష్మీనారాయణ, తిరుపతి, అన్ని షిఫ్టుల కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సభ్యత్వ రశీదు అందిస్తున్న శంకర్‌రావు

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- దొంగతనం కేసులో నిందితుల అరెస్టు - సొత్తు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో ఇటీవల కాలంలో వరుస దొంగతనాలకు పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ సోమవారం వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం కాగజ్‌నగర్ ఓల్డ్ కాలనీకి చెందిన గాలోత్ కుషాల్ (30) అనే యువకుడు స్కావెంజర్ వృత్తి చేస్తుంటాడు. కుషాల్ జల్సాలకు అలవాటు పడి అతడి మిత్రుడు అనిల్, బంధువు జైకుమార్‌తో కలిసి చోరీలకు పథకం వేసేవారు. కుషాల్ వృత్తి పనిమీద బయటకు వెళ్లి పగలు రెక్కీ నిర్వహించేవాడు. అనంతరం ముగ్గురు కలిసి పథకం పకారం చోరీలకు పాల్పడేవారు. ఇందులో భాగంగా ఇటీవల ఎస్పీఎం కాలనీలో ఎస్పీఎం ఉద్యోగులు కిషోర్ కుమార్ లోయా, సింగని లక్ష్మణ్, భూపాల్‌రావు, హేమ చంద్రరావు, నరేంద్రవర్మ ఇళ్లలో చోరీలో చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేయగా కుషాల్ తన మిత్రులతో కలిసి చోరీలకు పాల్పడ్డట్లు తేలింది. పక్కా ప్రణాళితో పోలీసులు చోరీ కేసును ఛేదించారు. వారి వద్ద నుంచి 18 తులాల బంగారు ఆభరణాలు, రూ. 10వేల నగదును స్వాధీనం చేసుకొని కుషాల్, అనిల్‌ను అరెస్టు చేశారు. చోరీ కేసును ఛేదించిన కానిస్టేబుళ్ల నాగరాజు, సాయి, సంపత్, నౌషద్‌ను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో టౌన్ సీఐ ప్రేంకుమార్, రూరల్ సీఐ కుమారస్వామి, టౌన్ ఎస్సై సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మా బడి మాకు కావాలి

- విద్యార్థులు.. తల్లిదండ్రుల ధర్నా - కలెక్టర్ హామీతో విరమణ


రోడ్డుపై పడుకున్న విద్యార్థులు

సిర్పూర్(టి), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని గురుకులం ఎదుట కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాస్తారోకో చేపట్టారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గత ఆగస్టు నెలలో రాష్ట్ర సాంఘిక సంక్షేమాధికారి, కలెక్టర్ 540 మంది విద్యార్థులను ఉమ్మడి జిల్లాలోని వివిధ గురుకులాల్లో సర్దుబాటు చేశారు. రెండు నెలలుగా చదువుకుంటున్న విద్యార్థులు అక్కడి విద్యాభ్యాసం, భోజన వసతి, ఇతర వసతులు సరిగ్గా లేవని విద్యార్థులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సోమవారం సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని గురుకులం ఎదుట కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాస్తా రోకో చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇక్కడే తాత్కాలికంగా వసతులు కల్పించి తమ పిల్లలను చదువులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రాంతాలకు తమ పిల్లలను పంపించడంతో విద్యాభ్యాసం నాశనమవుతుందని ఉన్నతాధికారులు వచ్చే వరకు తాము ఆందోళన విరమించబోమని పట్టుబడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రహీముద్దీన్ చేరుకుని కలెక్టర్ వెంకటేష్ దోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాలకు సమాచారం అందించారు. అయినా అధికారులు రావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు బలవంతంగా విద్యార్థుల తల్లిదండ్రులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. తిరిగి విద్యార్థులు రోడ్డుపై పడుకోవడంతో తహసీల్దార్ విద్యార్థులకు నచ్చచెప్పారు. తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్, సబ్ కలెక్టర్ కాగజ్‌నగర్ పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాల భవనంతో పాటు కౌటాల మండలం విజయనగరంలోని సాంఘిక పాఠశాలలో విద్యార్థులను తిరిగి సర్దుబాటు చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులకు మద్దతు తెలిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని అక్కడినుంచి పంపించి వేశారు. ఎస్సైలు సురేష్, సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లోని నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ సూచించారు. దండేపల్లి మండలం కన్నెపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించి సుమారు 170 పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది అంజూమ్, స్వప్న, శిరీష, సత్తయ్య, స్వాతి, ఇందిర, శ్రావణ్, కుమార్, నాయకులు, పశుపోషకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో భారీ వర్షం

బెల్లంపల్లి,అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. అలాగే పట్టణంలోని కాల్ టెక్స్ ఏరియాలో బారీ వర్షానికి ఇండ్ల వద్దకు వరదనీరు చేరుకుంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. మాజీ కౌన్సిలర్ బండి ప్రభాకర్ వరదనీరును దారిమళ్లి సమస్య పరిష్కరించారు.

ఫొటో స్టూడియోలు బంద్



స్టూడియోలు బంద్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

చెన్నూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలో సోమవారం ఫొటో స్టూడియోలను ఫొటోగ్రాఫర్లు బంద్ చేశారు. ఈ సందర్భంగా ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు దుర్గం ప్రమోద్ మాట్లాడుతూ ఫోటో పేపర్లు, ఇంక్‌లు, ఫ్రేమ్‌లు, రూమ్ అద్దెలు పెరిగాయని, దీంతో పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఫ్రేమ్‌ల ధరలను పెంచామని తెలిపారు. ఇందుకు గాను అన్ని ఫొటో స్టూడియోలను బంద్ చేశామన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

దండేపల్లి అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం తాళ్లపేట చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎదుల బుచ్చన్న, సేదం బాపు, మారునేని చిన్నులు బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సోమవారం మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు గృహంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు సమక్ష్యంలో బిఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పుతున్నారు. కార్యక్రమంలో ఎండి నజీర్, ఉస్మాన్‌ఖాన్ ఉన్నారు.

సైకిళ్లు అందజేత

తాండూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ సన్మానం సందర్భంగా అచ్చలాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయుడు సందుపట్ల రవి విద్యార్థులకు నాలుగు సైకిళ్లు అందజేసినట్లు ప్రధానోపా ధ్యాయురాలు ఉమాదేవి సోమవారం తెలిపారు. ఏఏపీసీ చైర్మన్ చిలకమ్మ, ఎంఈవో మల్లేశం, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ప్రదీప్, గ్రామపెద్దలు పోచయ్య, మురళీధర్‌రావు ఉన్నారు.

అమృత్.. ఆలస్యం



బెల్లంపల్లిలో పునాదిదశలోనే ఉన్న అమృత్ పథకం నీటి ట్యాంక్

- నత్తనడకన 2.0 పనులు
- జిల్లాలోని మున్సిపాలిటీలో తాగునీటికి తప్పని తిప్పలు

బెల్లంపల్లి, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించని చందంగా మారింది అధికారుల పరిస్థితి. జిల్లాలోని మున్సిపాలిటిల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గతేడాది అమృత్ పథకంలో భాగంగా కోట్లాది రూపాయలను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన పనులు మాత్రం నత్తనడకన సాగు తున్నాయి. దీంతో మున్సిపాలిటిల్లోని పట్టణ ప్రజలకు తాగు నీటి కష్టాలు తప్పడం లేదు.

నత్తనడకన పనులు...

జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, చెన్నూర్, లక్సెట్టిపేట, నస్పూర్, క్యాతనపల్లి మొత్తం ఏడు మున్సిపాలిటిలు ఉన్నాయి. మున్సిపాలిటిలోని ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలనే లక్ష్యంతో గత ఏడాది జూన్‌లో అమృత్ 2.0 పథకంలో భాగంగా ప్రభుత్వం నిధులను కేటాయించింది. ఇందులో భాగంగా మంచిర్యాల మున్సిపాలిటికి రూ. 48.50కోట్లు, బెల్లంపల్లి మున్సిపాలిటికి రూ.61.50కోట్లు, మందమర్రి మున్సిపాలిటికి రూ.30.50కోట్లు, క్యాతన్‌పల్లి మున్సిపాలిటికి రూ. 41.50కోట్లు, చెన్నూర్ మున్సిపాలిటికి రూ.31కోట్లు, లక్సెట్టిపేట రూ.20కోట్లు, నస్పూర్ రూ.73 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో మంచిర్యాలలో 21కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడంతో పాటు నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి. అలాగే చెన్నూర్‌లో 45 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణంతో పాటు 3 నీటి ట్యాంక్‌లను, లక్సెట్టిపేటలో 11కిలో మీటర్ల పైప్‌లైన్‌తో పాటు 3నీటి ట్యాంక్‌లను, మందమర్రిలో 12 కిలో మీటర్ల పైప్‌లైన్‌ను, క్యాతన్‌పల్లిలో 55కి లోమీటర్ల పైప్ లైన్‌తో పాటు 2వాటర్ ట్యాంక్‌లను, బెల్లంపల్లిలో 25కిలోమీటర్ల పైప్‌లైన్‌తో పాటు ఒక వాటర్ ట్యాంక్‌ను, నస్పూర్‌లో 7కిలోమీటర్ల పైప్‌లైన్‌తో పాటు 6 వాటర్ ట్యాంక్ నిర్మాణాలను చేపట్టాలి. నిధులు మంజూరై 15 నెలలు గడుస్తున్నప్పటికీ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. పలు మున్సిపాలిటిల్లోని నీటి ట్యాంక్‌లు పిల్లర్ల దశలోనే ఉన్నాయి. అమృత్ 2.0లో భాగంగా ప్రభుత్వం కోట్ల నిధులు మంజూరు చేసి పట్టణ ప్రజలకు శుద్ధ జలాన్ని సరఫరా చేయాలనే సంకల్పంతో చేపట్టిన పథకం పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మున్సిపాలిటీల్లో తాగునీటి తండ్లాటా..

మున్సిపాలిటి పరిధిలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. పలు మున్సిపాలిటిల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా లేకపోవడంతో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బెల్లంపల్లి మున్సిపాలిటిలో కాలంతో సంబంధం లేకుండా నీటి సమస్య ఏర్పడుతుంది. బెల్లంపల్లి మున్సిపాలిటిలో మొత్తం 34వార్డులు ఉన్నాయి. బెల్లంపల్లి మున్సిపాలిటికి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని అడా ప్రాజెక్టు నుంచి నీరు సరఫరా అవుతుంది. అడా ప్రాజెక్టు నుంచి తరుచు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతుండడంతో మున్సిపాలిటీలోని ప్రజలు తాగునీటి ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు అలాగే సింగరేణి సైతం తాగునీటిని సక్రమంగా అందించకపోవడంతో కార్మిక కుటుంబాలతో పాటు పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే జిల్లాలోని పలు మున్సిపాలిటిల్లో సైతం తరుచు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శాశ్వత తాగునీటి పరిష్కారానికి కోట్లాది నిధులు మంజూరైన పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో తాగునీటిని అందించాలని మున్సిపాలిటీల్లోని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం..

ఆరెపల్లి రమేశ్, బెల్లంపల్లి



తాగునీటికి తరుచు ఇబ్బందులు పడుతున్నాం. గత ఆరు నెలల నుంచి మంచినీరును సంబంధిత శాఖ అధి కారులు సరఫరా చేయడంలో విఫలమ వుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ఎండాకాలం, వానాకాలం అనే తేడా లేకుండా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. తాగునీటి సమస్య పరిష్కరించకపోతే వార్డు ప్రజలందరం కలిసి మున్సిపాలిటీని ముట్టడిస్తాం.

తాగునీటిని సక్రమంగా అందించాలి...

వెంకటేశ్, బెల్లంపల్లి



గత కొన్ని నెలలుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు గోదావరి జలాలను అందించాలి. అడా ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు కలుషితమవుతుండడంతో పట్టణ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. తాగునీటిని సక్రమంగా సరఫరా చేయకపోవడంతో మంచినీరును కొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవిస్తున్న స్పందించడం లేదు.

కాసిపేటలో కాంగ్రెస్ మూడుముక్కలాట

- అధిష్ఠానానికి తలనొప్పిగా మారిన వర్గ పోరు
- అభ్యర్థుల ఎంపికపై వీడని చిక్కుముడి



కాసిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కాంగ్రెస్ పార్టీ మూడు ముక్కలైంది. రానున్నస్థానిక సంస్థల అభ్యర్థుల ఎంపికలో మళ్లీ వర్గ పోరు తెరమీదకు వచ్చింది. కాంగ్రెస్‌పార్టీలో కొత్తతరం, పాతతరం అంటూ వర్గపోరు కొనసాగు తుండగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు వర్గం సైతం అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలిపేందుకు రంగం సిద్ధం చేయ డంతో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితిపై రాజకీయ వర్గాల్లో ఈ అంశంపై తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత నెలలో జరిగిన దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ప్రేమ్‌సాగర్‌రావు తమ్ముడు కొక్కిరాల సత్యపాల్‌రావు గడ్డం బ్రదర్స్ బలపర్చిన అభ్యర్థిని ఓడించి మండలంలో తన నాయకత్వాన్ని పదిల పర్చుకున్నాడు. అదే ఊపులో కొనసాగు తున్న ప్రేమ్‌సాగర్‌రావు ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలం నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ నుంచి మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ టికెట్లు ఆశిస్తున్న ఆశావాహుల జాబితాను తయారు చేసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మండల నాయ కులకు సూచించారు. దీంతో మండల కేంద్రానికి చెందిన పార్టీ అధ్య క్షుడు ప్రదీప్, తాజా మాజీ వైస్ ఎంపీపీ పుస్కూరి విక్రమ్‌రావులు శనివారం రెండు బృందాలుగా హైద్రాబాద్‌కు వెళ్లి జాబితాను ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు అందజేశారు. ఇరు వర్గాల నుంచి ఒక్కో సీటుకు ఇద్దరేసి పేర్లు ఇవ్వడంతో అభ్యర్థుల ఎంపిక అధిష్ఠానానికి తలనొప్పిగా మారిందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వాపోతున్నారు.

సొంత మండలంలో పట్టు సాధించేందుకు ప్రేమ్‌సాగర్‌రావు వర్గం సైతం బలంగా ప్రయత్నిస్తుండగా ఎమ్మెల్యే వర్గం నుంచి ఇద్దరు పోటీ పడు తుండడంతో స్థానిక ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది.

నిఘా నీడలో 'స్థానిక' ఎన్నికలు..

(3వ పేజీ తరువాయి)

ప్రక్రియను వీడియో గ్రాఫ్ చేయడం ద్వారా పారదర్శకత అమలు చేస్తారు.

నగదు రవాణాపై ఆంక్షలు...

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో భాగంగా నగదు రవాణాపై ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. ఎవరైనా రూ. 50వేల కంటే ఎక్కువ నగదు లేదా రూ. 10వేల కంటే విలువైన మాదక ద్రవ్యాలు, మద్యం, బహుమతి వస్తువులు, తదితర ఎన్నికల ప్రలోభాలుగా భావించే ఇతర వస్తువులు తరలించడం చట్ట విరుద్ధం. తనిఖీల సమయంలో నగుదుతోపాటుపై వస్తువులు దొరికితే ఎస్ఎస్‌టీ సభ్యులు వాటిని స్వాధీనం చేసుకుంటారు. వాటికి సరియైన ఆధారాలు ఉంటే తిరిగి అందజేస్తారు. వ్యాపారం నిమిత్తం బ్యాంకుల్లో డిపాజిట్ చేయడానికి నగదు తీసుకు వెళ్లే పక్షలో సదరు వ్యక్తి పాన్ కార్డు, వ్యాపార ధృవీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్ వెంట ఉండాలి. వైద్య చికిత్స కోసం నగదు తీసుకెళ్లాల్సి వస్తే అందుకు సంబంధించిన రుజువును అధికారులకు సమర్పించాలి. వివాహ వేడుకల్లో భాగంగా నగదుకు సంబంధించిన వివాహ ఆహ్వాన పత్రం, ఇతర ధృవీకరణ పత్రాలు వెంట ఉంచుకోవలసి ఉంటుంది.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరగౌడ్

బెల్లంపల్లి, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరగౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలో నియోజకవర్గ స్థాయి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలందరూ బీజేపీవైపే మొగ్గు చూపుతున్నారని పార్టీ నాయకులందరూ కలిసి కట్టుగా ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ ఎల్లవేళలా ముందుంటుందని అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసకెళ్లాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో బరిలో ఉండే అభ్యర్థుల జాబితాలను సేకరించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, నాయకులు హేమాజీ, రాచర్ల సంతోష్, మహేందర్‌గౌడ్, గోవర్ధన్, సంతోష్, కల్యాణి, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న చేకుర్తి సత్యనారాయణరెడ్డి

భీమారం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని, ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు చేకుర్తి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం భీమారంలో ఆయన మాట్లాడుతూ మండలంలో జడ్పీటీసీ ఎస్సీ జనరల్ రిజర్వుడ్ స్థానం, అలాగే ఎంపీటీసీలు గతంలో నాలుగు ఉండగా ఇప్పుడు ఐదుకు పెరిగాయన్నారు. నూతనంగా భీమారం గ్రామ పంచాయతీలోని పలు వార్డులను కలుపుకుని బూగురుపల్లి గ్రామపంచాయతీ పోలంపల్లి గ్రామపంచాయతీ పలు వార్డులను కలిపారన్నారు. ఎంపీటీసీ స్థానాలకు భీమారం 1 ఎంపీటీసీ బీసీ మహిళ, భీమారం 2 ఎంపీటీసీ బీసీ జనరల్, భీమారం 3 ఎంపీటీసీ ఎస్టీ జనరల్ రిజర్వుడ్ స్థానాలు వచ్చాయన్నారు. కాజీపల్లి ఎంపీటీసీ జనరల్ అభ్యర్థికి కేటాయించారన్నారు. బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో బీసీలకు రెండు సీట్లు కేటాయించడం సంతోషకర మన్నారు. స్థానిక మంత్రి వివేక్‌వెంకటస్వామి ఎవరికి బీఫారం అందించినా ఎలాంటి విభేదాలు లేకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. నాయకులు రవి, అమర్ సింగ్, లచ్చన్న, అజయ్, రవితేజ, మొండయ్య, లక్ష్మణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేలకొరిగిన పంటను పరిశీలించిన అధికారులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోటపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరి పంట నేల పాలు అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలోని ఎసన్‌వాయి గ్రామానికి చెందిన దుర్గం మల్లక్క సాగు చేసిన వరి పంట నేలపాలైంది. తనకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మల్లక్క ఆవేదన వ్యక్తం చేయగా సోమవారం మండల వ్యవసాయాధికారి మార్క్‌గ్లాడ్‌స్టన్, ఏఈవో రాజ్‌కుమార్‌లు ఎసన్‌వాయి గ్రామానికి వెళ్లి పంటను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. మల్లక్క ఐదున్నర ఎకరాలు సాగు చేయగా ఇందులో 4 ఎకరాలకు నష్టం వాటిల్లిందని, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

మద్యం టెండర్లకు విశేష స్పందన



మద్యం టెండర్లు స్వీకరిస్తున్న అధికారులు

మంచిర్యాల క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నందగోపాల్ తెలిపారు. గతంలో రెండు అప్లికేషన్లు రాగా సోమవారం 6 అప్లికేషన్లు వచ్చినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు అప్లికేషన్‌తో పాటు ఫీజు రూ. 3 లక్షలు, చలాన్, లేదా డీడీతో పాటు మూడు కలర్ ఫోటోలు, పాన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రాలు సమర్పించాలన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సింగరేణి మెరిట్ స్కాలర్‌షిప్



జాహ్నవికి చెక్కును అందజేస్తున్న ఎస్టీపీపీ అధికారులు

జైపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థిని ఎర్రోజు జాహ్నవికి సింగరేణి మెరిట్‌స్కాలర్‌షిప్ అందించినట్లు ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి పేర్కొన్నారు. సోమవారం ఎస్టీపీపీలో జాహ్నవికి మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కును అందజేసి మాట్లాడారు. సింగరేణి సంస్థ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ప్రతియేటా మెరిట్ స్కాలర్ షిప్ అందిస్తామన్నారు. ఇందులో భాగంగా ఎస్టీపీపీలో విజిలెన్స్ డిపార్టు మెంట్‌లో సీనియర్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న ఎర్రోజు రాజ్ కుమార్‌చారి కూతురు జాహ్నవికి మెరిట్ స్కాలర్‌షిప్‌ను చెక్కును అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం నర్సింహారావు, ఏఐటీయూసీ పిట్‌సెక్రటరీ సత్యనారాయణ, అధికారులు అప్పారావు, మదన్ మోహన్, మురళీధర్, కిరణ్‌బాబు, రామబ్రహ్మం పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలి

కన్నెపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి, కన్నెపల్లి మండల ఎన్నికల ప్రభారి రామగౌని మహీధర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కన్నెపల్లిలో ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. మండలంలో ఉన్న 5 ఎంపీటీసీ స్థానాల్లో ఆశావాహుల అభ్యర్థుల దరఖాస్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందేలా నాయకులు కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖైదం ఆశన్న, మాజీ మండల అధ్యక్షుడు రామన్న యాదవ్, నాయకులు పోశన్న, బీమన్న, సంతోష్, సత్తయ్య, మల్లేష్, రాజు, శ్రీనివాస్, తిరుపతి, విజయ, గంగాధర్, పోశం పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని బుట్టిరాజ రాం కాలనీకి చెందిన శ్రీనివాస్(39) ఉరేసు కొని ఆత్మహత్య చేసుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. బుట్టిరాజరాం కాలనీకి చెందిన సింగనాని శ్రీనివాస్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రతి రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. అదే క్రమంలో ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. అనంతరం కాసేపటికి బెడ్రూం గడియపెట్టుకున్నాడు. ఎంత సమయం అయినా తలుపు తీయకపోవడంతో సాయంత్రం తలుపు గడియ తెరిచి చూసే సరికి ఉరేసుకొని మృతిచెంది ఉన్నాడు. శ్రీనివాస్ భార్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

ఈ నెల 16న దండారీ దర్బార్



మాట్లాడుతున్న దండారీ ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు

కాసిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 16న మండలంలోని దేవాపూర్ నల్లావాగు వెంకటాద్రి ఆలయం ఆవరణలో దండారీ దర్బార్‌ను నిర్వహించనున్నట్లు దండారీ ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కుంరం జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం వెంకటాద్రి ఆలయం ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతియేటా దండారీ ఉత్సవాలను గిరిజన సంప్రదాయ బద్ధంగా ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ సారి ఈ నెల 15న మండలంలోని గుస్సాడీ, దండారీలన్నీ వెంకటాద్రి ఆలయానికి చేరుకోవాలని, అనంతరం ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. 16న దండారీ దర్బార్ నిర్వహిస్తామన్నారు.

ఇందులో ఆదివాసీ గిరిజన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ ఆదివాసీ గూడాల అభివృద్ధి ప్రజా సంక్షేమంపై మాట్లాడతామన్నారు. మండలంలోని గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు, స్థానిక పటేళ్లతో పాటు రాయిసెంటర్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో దండారీ ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆడె జంగు, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, గౌరవాధ్యక్షుడు రాయి సిడం రాందాస్, ఉపాధ్యక్షుడు పెంద్రం ప్రభాకర్, ఆత్రం జంగు, రాయిసిడం సోము, కనక గోవర్ధన్, సోయం సూరు, మడావి ధర్మారావు, సిడాం గణపతి పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

భీమారం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : భీమారం గ్రామంలోని వరి పంటను సోమవారం మండల వ్యవసాయాధికారి సుధాకర్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటలో పాము పొడ, బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు ఉందని గుర్తించామన్నారు. దీని నివారణకు మెక్సొకొనసాల్, వాలిడామైసిన్ 400 మిల్లీ లీటర్లు ప్లాంటోమైసిన్ 80 గ్రాములు కలుపుకుని ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

పాలకుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పుట్నూర్ ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కేంద్రంలోకి ప్రవేశించి కోడిగుడ్లను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం పాఠశాలను తెరిచేందుకు వెళ్లిన కేంద్రం నిర్వాహకురాలు కొలిపాక ఉమ గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూపర్‌వైజర్ సువర్ణ కేంద్రాన్ని సందర్శించారు.

నామినేషన్ స్వీకరణ కేంద్రాల పరిశీలన



నామినేషన్ స్వీకరణ కేంద్రాల ఏర్పాటు కోసం పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో

జైపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నామినేషన్‌ల స్వీకరణ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లను, ఎన్నికల మెటీరియల్‌ను సోమవారం ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దృష్ట్యా అధికారుల ఆదేశాల మేరకు ఈ కేంద్రాలను పరిశీలించామన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పని చేసి ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఈ కార్యక్ర మంలో సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్‌లు మధులత, మల్లేష్, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ పాల్గొన్నారు.

కార్మికులకు యూనిఫాం అందజేత

లక్సెట్టిపేట, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పురపాలక కార్యాలయంలో విధులు చేపడుతున్న పారిశుధ్య కార్మికులకు సోమవారం మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్ యూనిఫాం అందజేసారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతీ ఏటా కార్మికులకు రెండు జతల యూనిఫాం ప్రభుత్వం ఇస్తున్నట్లు ప్రతీ ఒక్కరూ యూనిఫాం ధరించి విధులు చేపట్టాలన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ మేనేజర్ కల్లెడ రాజశేఖర్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.



కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న కమిషనర్

ఆంధ్రజ్యోతి
6
కుమరం భీం
జిల్లా వార్తలు
మంగళవారం 7 అక్టోబరు 2025



రాష్ట్ర పండుగగా కుమరం భీం వర్ధంతి

ఆసిఫాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదివాసుల ఆరాధ్య దైవమైన కుమరం భీం వర్ధంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించిందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న ఆశ్వయుజ పౌర్ణమి రోజున అధికారికంగా జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్ ప్రాంతంలో భీం వర్ధంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కాగా భీం వర్ధంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడంపై డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు సీఎం రేవంత్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

- జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాం సర్కారుపై సమరం
- భీం స్ఫూర్తితో రజాకార్లతో పోరాడిన యువకులు
- ఆ మహనీయుడి పోరాట ఫలితంగానే ఆదివాసీలకు హక్కులు
- నేడు కుమరం భీం వర్ధంతి
- జోడేఘాట్‌లో ఏర్పాట్లు పూర్తి

గోండు బెబ్బులి


జోడేఘాట్ గ్రామం

ఆసిఫాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం నైజాంకు వ్యతిరేకంగా సమర భేరి మోగించిన యోధుడు.. నిజాం నిరంకుశ పాలనలో గిరిజనులకు జరుగుతున్న అన్యా యాలపై ఎలుగెత్తిన వీరుడు.. జల్.. జంగల్.. జమీన్ (భూమి, నీరు, అడవి) హ క్కుల కోసం చేసిన పోరాటంలో అమరుడై గిరిజనుల ఆరాధ్య దైవమయ్యాడు కుమరం భీం. ఓ వైపు దేశ వ్యాప్తంగా స్వాతంత్ర్య పోరాటం మహోద్యమంగా కొనసాగుతుంటే.. మరో పక్క తెలంగాణలో నిజాం నిరంకుశత్వం.. రజాకార్ల ఆగడాలపై తిరుగుబాట్లు జరుగుతున్న రోజులవి. ఈ రెండు ఉద్యమాలకు సమాంతరంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో కుమరం భీం నాయకత్వంలో గిరిజనుల స్వాతంత్ర్య పోరాటం కొనసాగింది.

ఆదివాసీ బిడ్డలపై..

ఆదివాసీ బిడ్డలపై అమానుష నిర్బంధానికి వ్యతిరేకంగా కర్కశ నిజాం సర్కార్‌పై జల్ జంగల్ జమీన్ నినాదంతో జంగు సైరన్ ఊదిన ఆదివాసీ నిప్పుకణిక కుమరం భీం ఈ లోకాన్ని విడిచి ఇప్పటికి 85 వసంతాలు పూర్తయ్యాయి. అడవి బిడ్డల ఆత్మస్థైర్యాన్ని శిఖర స్థాయికి చేర్చి తను కనుమరుగైపోయినా తను నింపిన స్ఫూర్తిని, ధైర్యాన్ని అడవి బిడ్డలు నేటికీ తలుచుకుంటూనే ఉన్నారు. ఏటా ఆశ్వయుజ పౌర్ణమి రోజున ఆయన వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు. శిస్తు(పన్నులు) పేరుతో ఆదివాసీలపై నిజాం అనుచరులు చేస్తున్న ఆగడాలను సహించలేక సాయుధ పోరే సమస్యకు పరిష్కారమని నమ్మి 1940కి ముందే జోడేఘాట్ పోరాట గడ్డపై తుపాకీ ఎక్కు పెట్టాడు. తనదైన గెరిల్లా వ్యూహాలతో నిజాం సైన్యాన్ని ముప్పు తిప్పలు పెట్టి నైజాం అల్లూరిగా నిజాం గుండెల్లో నిద్ర పోయాడు. నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాటం చేయక ముందే జిల్లాలో కుమ్రం భీం తుపాకీ చేత పట్టి ఉద్యమానికి సిద్ధమయ్యాడు. భీం పోరాట స్ఫూర్తితోనే 1948లో నిజాం ప్రభువుపై భారత ప్రభుత్వం జరిపిన సైనిక చర్యకు మద్దతుగా రజాకార్లతో ఎంతో మంది యువకులు సాయుధ పోరాటానికి దిగారు. జాగీరుదారుల అణచివేత, అత్యాచారాలు, ఆగడాలను తట్టుకోలేక తనతో కలిసి పెరిగిన అడవి బిడ్డలనే అనుచరులుగా మార్చుకుని వారికి సాయుధ శిక్షణ ఇవ్వడం ద్వారా నిజాం సైనికులను ఓడించినంత పని చేశారు. అడవిలో పుట్టిన గిరిజనులు ప్రకృతి సంపదను అనుభవించకుండా దోపిడీ చేస్తున్న దళారీలు, వ్యాపారులు, అటవీ అధికారుల వ్యవస్థకు నిరసనగా ఎదురు తిరిగారు. అడవిలో కట్టెలు కొట్టకూడదని, పశువులు మేపకూడదని, భూము లు దున్నకూడదని నిజాం ప్రభుత్వం ఆంక్షలు విధించడంను భీం సవాలు చేయడమే కాకుండా వారి ఆదేశాలను ధిక్కరించారు.

చిన్ననాటి నుంచే తిరుగుబాటు

భీం స్వగ్రామం ఆసిఫాబాద్ మండలం సంకెపల్లి గ్రామం. భీం తండ్రి ఆయన బాల్యంలో మరణించారు. దీంతో పదిహేనవ ఏటా కుటుంబ, గ్రామ పెద్దగా బాధ్యతలు చేపట్టారు. నిజాం పోలీసుల, అటవీ అధికారుల ఆగడాలను సహించలేక పోయారు. తన చిన్నతనంలో భీం సోదరులు అటవీ శాఖ సిబ్బందితో పడుతున్న గొడవలకు కారణాలను తెలుసుకున్నారు. వారిని ఎదురించడం ప్రారంభించారు. ఇదే క్రమంలో అక్కడి సమకాలిక సమస్యలు, కారణాలపై అవగాహన పెంపొందించుకున్నాడు. శతాబ్దాలుగా తాము అనుభవిస్తున్న అటవీ, సహజ సంపదలపై నిజాం సర్కా రు పన్నులు వసూలు చేయడం, ఈ నెపంతో చౌకీదార్లు, పట్వారీలు గోండు గూడేల పైబడి దోచుకోవడం, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించడం భీంను కలచివేశాయి. దీంతో ఆయన స్థానికంగా ఉన్న జమీందార్లు, చౌకీదార్లపై నిజాం ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడానికి హైదరాబాద్ వెళ్లాడు. కానీ నిజాం ప్రభువు అతడిని కలవక పోవడంతో తిరిగి వచ్చి సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని పోరుబాట పట్టారు.

హైదరాబాద్ నుంచి..

కుమరం భీం బల పడితే మొత్తంగా ఈ ప్రాంతంలోనే తన అధికారానికి బీటలు వారుతాయని భయపడిన నిజాం ప్రభువు అతడిని భౌతికంగా అంత మొందించేందుకు ప్రత్యేక దళాన్ని హైదరాబాద్ నుంచి జోడేఘాట్‌కు పంపారు. అయితే ఆ ప్రయత్నం ఫలించక పోవడంతో కుట్ర చేసైనా ఆయనను అడ్డు తొలగించుకోవాలని ఆయన సహచరులను లోబర్చుకున్నారు. దీంతో కుమరం భీం అనుచరుడైన మడావి కొద్దు అనే వ్యక్తి 1940 అక్టోబరు 6న ఇచ్చిన సమాచారం మేరకు నిజాం ప్రభుత్వం అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల సహకారంతో పెద్ద ఎత్తున సైనికులను మోహరించి భీం సైన్యం కోసం గాలింపులు చేపట్టింది. అర్ధరాత్రి భీంపై నిజాం పోలీసులు ఆకస్మిక దాడితో చుట్టు ముట్టి గుండ్ల వర్షం కురిపించారు. నిజాం పోలీసులను వీరోచితంగా ఎదుర్కొని చివరకు మృత్యుదేవత ఒడిలో తుది శ్వాస విడిచారు. భీం నిజాం సైన్యం కాల్పుల్లో మరణించడంతో ఆయన అనుచరులు చెల్లాచెదరయ్యారు.

గెరిల్లా దళం ఏర్పాటు..

ఆదివాసీ గిరిజన హక్కుల కోసం పోరాడేందుకు ఒక్కో కుటుంబం నుంచి ఒక్కో గిరిజన యువకుడిని చేరదీసి సైన్యాన్ని ఏర్పాటు చేశారు. కుమరం భీం. వెదురు కొట్టడం, విల్లంబులు, బాణాలు తయారు చేయడం వారికి నేర్పించాడు. ఉచ్చులు పెట్టడం, గెరిల్లా దాడులపై శిక్షణ ఇచ్చాడు. బర్మారా (ఒకరకమైన నాటు తుపాకులు) ఇంటికోటి ఉండాలని చెప్పేవాడు. అరక(నాగలి), పొరక, మేకలు, కంచె, కంచెలపై ని జాం ప్రభుత్వం తరపున పట్వారీలు, చౌకీదార్లు పట్టీలు(పన్నులు) వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ వారిపై దాడులు చేసేవారు. నైజాం కాలంలో పట్టేదారులు గిరిజన మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో వారిపై కుమరం భీం దాడులు చేసేవాడు. భూస్వామి సిద్దిక్‌తో గొడవకు దిగాడు. ఈ గొడవలో సిద్దిక్ తీవ్రంగా గాయపడడంతో ఈ వార్త నిజాం ప్రభువు చెవిన పడింది. దాంతో ఆగ్రోహోదగ్రుడైన నిజాం అసబ్ జాహీ భీంను బంధించి తెమ్మంటూ పోలీసులకు హుకుం జారీ చేశారు. ఈ నేపథ్యంలో తన మద్దతు దారుల ఒత్తిడి మేరకు భీం అజ్ఞాత జీవితంలోకి వెళ్లారు.

అధికారికంగా వర్ధంతి కార్యక్రమం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొట్టమొదటి సారిగా 2014లో కుమరం భీం వర్ధంతి కార్యక్రమాన్ని అప్పటి ప్రభుత్వం అధికారికంగా చేపట్టింది. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా జోడేఘాట్‌కు అప్పటివ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు హాజరయ్యారు. దీంతో ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా జోడేఘాట్‌కు వచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. వర్ధంతి సందర్భంగా నిర్వహించిన దర్బార్‌లో రూ.25 కోట్లను మంజూరు చేసి జోడేఘాట్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా మంగళవారం భీం 85వ వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కుమరం భీం వర్ధంతి కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

కుమరం భీం వర్ధంతికి ఏర్పాట్లు పూర్తి


సభా స్థలి వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు

కెరమెరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం జోడేఘాట్‌లో మంగళవారం నిర్వహించనున్న కుమరం భీం వర్ధంతి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఏర్పాట్లను ఏఎస్పీ చిత్తరంజన్ పరిశీలించారు. వర్ధంతి సభకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి భారీగా గిరిజనులు తరలి రానున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఐటీడీఏ, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. వర్ధంతి సభకు పలువురు మంత్రులు హాజరవుతారని అధికారులు తెలిపారు.

శానిటేషన్ పనుల పరిశీలన..

శానిటేషన్ పనులను డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ సోమవారం పరిశీలించారు. హట్టి బేస్ క్యాంపు నుంచి జోడేఘాట్ వరకు పనులు చేపడుతున్నారు. వర్షాల కారణంగా రోడ్డు కోతకు గురికావడంతో ఆయా ప్రదేశాల్లో బారికేడ్లను ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్, ఎంపీడీవో అంజద్ పాషా ఏర్పాట్లను పరిశీలించారు.

నేడు మంత్రుల రాక

కెరమెరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జోడేఘాట్‌లో మంగళవారం నిర్వహించనున్న కుమరం భీం వర్ధంతిని పలువురు మంత్రులు రానున్నారని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గిరిజన సాంఘిక సంక్షేమ, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, జిల్లా ఇన్‌చా ర్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి రానున్నారు.

రేపు సెపక్‌తక్రా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

రెబ్బెన, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 8న సెపక్ తక్రా అండర్-14, 19 బాల బాలికల పోటీలు నిర్వహించడం జరుగుతుందని సెపక్ తక్రా ఆర్గనైజింగ్ జిల్లా సెక్రెటరీ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు హాజరు కావాలని అన్నారు. సెపక్ తక్రా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కుమ్మరి మల్లేష్‌ను సంప్రదించాలని కోరారు.

భీం వర్ధంతికి పటిష్ట బందోబస్తు

- ఏఎస్పీ చిత్తరంజన్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం వర్ధంతి సందర్భంగా కెరమెరి మండలం జోడేఘాట్ ప్రాంతంలో పటిష్ట భద్రత చర్యలు తీసుకున్నామని ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మంగళవారం జరగనున్న కార్యక్రమానికి మొత్తం 462 మంది పోలీసు అధికారులను, సిబ్బందిని నియమించామని, ఇద్దరు డీఎస్పీలు, ఎనిమిది మంది సీఐలు, 25 మంది ఎస్సైలు, 51 ఏఎస్సైలు, 136 మంది కానిస్టేబుళ్లు, 56 మంది మహిళా కానిస్టేబుళ్లు, 79 మంది హోంగార్డులతో బందోబస్తు చేయనున్నట్టు తెలిపారు. ప్రముఖ ప్రదేశాలు, వేదిక, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ, వసతి సదుపాయాల వద్ద ప్రత్యేక పహారా బృందాలు, ట్రాఫిక్ నియంత్రణ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట డీఎస్పీ వాహిదుద్దీన్, సీఐ సత్యనారాయణ, ఎస్సైలు మధుకర్ పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షుడిగా తులసీరాం

జైనూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా పూర్కు తులసీరాంను సోమవారం కాగజ్‌నగర్‌లో జరిగిన టీఎస్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అడె ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తులసీరాం ఎన్నికపై మాజీ మండల అధ్యక్షుడు ఆత్రం దత్తు, భుమన్న హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని తులసీరాం అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

బెజ్జూరులో భారీ వర్షం

- లో లెవల్ వంతెన పైనుంచి ఉప్పొంగిన నీరు.. స్తంభించిన రాకపోకలు

బెజ్జూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో సోమవారం భారీ వర్షం కురవడంతో మండలంలోని లో లెవల్ వంతెనలు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. కుశ్నపల్లి- సోమిని గ్రామాల మధ్య లోలెవల్ వంతెనల పైనుంచి భారీగా వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. హైలెవల్ వంతెన లేని కారణంగా వాగు ఉప్పొంగినప్పుడల్లా ప్రతీసారి రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వాగు అవతల ఉన్న ఎనిమిది గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

పిడుగు పాటుకు రెండు ఎద్దుల మృతి

కౌటాల (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం ముత్తంపేట గ్రామంలో రైతు బెండారే శ్యాంరావుకు చెందిన రెండు ఎద్దులు సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. రెండు ఎద్దులు మృతి చెందడంతో జీవనాధారం కోల్పోయానని రైతు శ్యాంరావు వాపోయారు. అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలఇంచి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సిర్పూర్ (టి) మండలంలో అత్యధికం..

ఆసిఫాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. బెజ్జూరు మండలం కుశ్నపల్లి-సోమిని గ్రామాల మధ్యలో లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించింది. సిర్పూర్ (టి) మండలంలో 50.5 మిల్లీమీటర్లు, బెజ్జూరులో 43 మిల్లీమీటర్లు, రెబ్బెనలో 27 మిల్లీమీటర్లు, కాగజ్‌నగర్‌లో 11.3 మిల్లీమీట ర్లు, వాంకిడిలో 9.5 మిల్లీమీటర్లు, ఆసిఫాబా ద్‌లో 5 మిల్లీమీటర్లు, కౌటాలలో 2.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.


బెజ్జూరులో నిలిచిపోయిన రాకపోకలు


పిడుగు పాటుకు మృతి చెందిన ఎద్దులు